ప్రజాశక్తి
శనివారం 1 ఫిబ్రవరి 2025
5
అల్లూరి సీతారామరాజు



మోకాళ్లపై నిరసన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఏకలవ్య పాఠశాల భవనాల నిర్మాణంకు భూములు ఇచ్చిన భూదాతలకు ఉద్యోగాలు కల్పించి న్యాయం చేయాలని కోరుతూ ఆ పాఠశాల ఆవరణ ఎదుట చేపట్టిన ఆందోళన శుక్రవారం 9వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన శిబిరంలో పాల్గొని మోకాళ్ళతో నిలబడి నిరసన తెలియజేస్తూ తమ సంఘీభావాన్ని తెలియజేశారు. అనంతరం ఆ పార్టీ రాష్ట్ర ప్రతినిధి చిన్నస్వామి మాట్లాడుతూ, భూములు ఇచ్చిన దాతలకు ఉద్యోగాలు కల్పించకుండా వేరే వారికి వారి స్థానంలో నియమించడం సరికాదన్నారు. తొమ్మిది రోజు నుంచి దీక్షలు చేపట్టి ఆందోళన చేస్తున్నా అధికారులు న్యాయం చేయకపోవడం విచారకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పరశురాం, జగన్నాథం, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న నేతలు

అయ్యన్న వ్యాఖ్యలపై ఆందోళనలు


జి.మాడుగుల మండలం పోతడిగొందిలో నినాదాలు చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-జి.మాడుగుల: గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులు పెట్టుబడులు పెట్టేందుకు 1/70 చట్టం ఆటంకంగా ఉందని, గిరిజన చట్టాలను సడలించాలని స్పీకర్ అయ్యన్న చేసిన వ్యాఖ్యలపై ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని గెమ్మెలి పంచాయతీ పోత్తడిగొంది గ్రామంలో. ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యాన గిరిజనులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం మండల నాయకులు సిదేరి సత్తిబాబు మాట్లాడుతూ, 1/70 చట్టంపై చట్టంపై అయ్యన్న వ్యాఖ్యలు సరికాదన్నారు. 1/70చట్టం లేకుంటే గిరిజన భూములకు రక్షణ ఉండదని, ఇది కాస్త మారిస్తే ఆదివాసీ ప్రాంతం సర్వనాశనం అయిపోతుందన్నారు. ప్రభుత్వం కావాలని అభివృద్ధి పేరుతో ఆదివాసి ప్రాంతాలను మైనింగ్, బాక్సైట్ వంటి ఖనిజ సంపద దోచుకపోవడానికి ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. గతంలో టిడిపి బాక్సైట్ తీయాలని ట్రైబుల్ అడ్వైజరీ కమిటీలో 1/70 చట్టానికి వ్యతిరేకంగా తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఆ తర్వాత ఉవ్వెత్తున ఉద్యమాలు చేయడంతో వెనక్కి తీసుకోవడం జరిగిందన్నారు.

అదే స్ఫూర్తితో మళ్లీ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని ఆదివాసి ప్రాంతంలో 1/70 చట్టం ప్రతిష్టంగా అమలు చేయాలని, లేనియెడల ఉద్యమం ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం నాయకులు గేమ్మిలి కొండబాబు, కొర్ర అర్జున్, కొర్ర నారాయణ, గేమ్మిలి ప్రవీణ పాల్గొన్నారు.

పెదబయలు: అయ్యన్న వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఆదివాసి గిరిజన సంఘం, ఆదివాసీ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెదబయలు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు, ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్షులు సాగని ధర్మానపడాల్, పెదబయలు జెడ్పిటిసి కూడా బొంజుబాబు, మాట్లాడుతూ, 1/70చట్టంతో గిరిజన భూములకు రక్షణ ఉందన్నారు. ఆదివాసీ ప్రాంతంలో అడవులను బడా పెట్టుబడిదారులకు అప్పజెప్పడానికి ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి ప్రజాసంఘాల నాయకులు పి సా కమిటీ గోమంగి అధ్యక్ష కార్యదర్శులు కూడా రాధాకృష్ణ, జంపరంగి సునీల్ కుమార్, రోగుల పీసా కమిటీ కార్యదర్శి గుబరి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు

సీలేరు: స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన ప్రకటనపై రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛమైన ప్రకటన చేయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు మార్కు రాజు, భాకూరి కోటేశ్వరరావు గొర్ల గణేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీకే వీధి మండలం దుప్పిలివాడు పంచాయతీలో శుక్రవారం నిరసన కార్యక్రమం చపట్టారు. ఈ సందర్భంగా వారు 1/70 యాక్ట్ సవరణ ద్వారానే


పెదబయలులో నిరసన చేపడుతున్న నాయకులు


దుప్పిలివాడులో నిరసన చేపడుతున్న గిరిజనులు , నేతలు

పెట్టుబడులు వస్తాయని అయ్యన్నపాత్రుడు పేర్కొనడం హస్యాస్పదంగా ఉందన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉండి గిరిజన హక్కులు, చట్టాలకు తుట్లు పొడిసేలా ప్రకటన చేయడం సమంజసం కాదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు ఈ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదను దోసిపెట్టడానికే ఇటువంటి ప్రకటన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు మనోజ్ కుమార్ పీసా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు శెట్టి రాంబాబు వందల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పలు పార్టీల నేతలు ఖండన

1/70 చట్టం జోలికొస్తే సహించం : సిపిఐ

ప్రజాశక్తి -పాడేరు :1/70 చట్టం జోలికి ఎవరు వచ్చినా ఆదివాసీలు సహించబోరని సిపిఐ జిల్లా కార్యదర్శి పోట్టిక సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 1/70 చట్టం ఆదివాసులకు రక్షణ కవచం, గుండెకాయ వంటిదన్నారు. ఈ చట్టాల జోలికి ఎవరైనా వస్తే, తమ ప్రాణాలు పణంగా పెట్టి కాపాడుకుంటామన్నారు. సాక్షాత్తు ఒక సభాపతి మాట్లాడటం సరికాదన్నారు. సభాపతి మాటల వెనక ప్రభుత్వ రహస్య ఏజెండా ఏమైనా ఉందేమోనని సందేహం వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చంటి, జల్లి రాజు బాబు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

అయ్యన్న క్షమాపణ చెప్పాలి : సిపిఎం

హుకుంపేట: ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని, రద్దుకు ఎటువంటి ప్రయత్నాలు చేపడితే సహించబోమని సిపిఎం స్పష్టం చేసింది. ఏజెన్సీలో అభివృద్ధి జరగాలంటే 1/70 చట్టాన్ని సవరించాలని శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మీడియా సమావేశంలో ఆ పార్టీ మండల కార్యదర్శి వి.లక్ష్మణరావు మాట్లాడుతూ ఆదివాసీ భూములకు రక్షణ కల్పించే ఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. ఇప్పటికే టూరిజం పేరుతో పలు ఉల్లంఘనలు జరుగుతున్నాయని, వీటిని వెంటనే అరికట్టాలని కోరారు. బినామీల పేరుతో గిరిజన భూముల్లో లాడ్జీలు పెట్టి గిరిజనులకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు 1/70 ని సవరిస్తే గిరిజనులకు భూమి దక్కకుండా పోతుందని, ఏజెన్సీలో లభించే సహజ వనరులను బడా కార్పొరేట్లకు కట్టబెట్టడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎప్పటి నుండో పలు పథకాలు వేస్తోందని వివరించారు. మోడీ ప్రభుత్వం ఈ నిబంధనలను సడలించి గిరిజనుల నుండి భూములను బలవంతంగా లాక్కోడానికి ప్రయత్నిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కూడేలి రమణమూర్తి, కే.అప్పారావు, కృష్ణమూర్తి, కిల్లో రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి: కాంగ్రెస్

చింతపల్లి :అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు 1/70 చట్టంపై చేసిన వాక్యాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రీమల నవభారత్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వం గిరిజనులకు రాజ్యాంగం కల్పించిన చట్టాలను, హక్కులను అమలు చేయకపోగా, నిర్వీర్యం చేసే పని చేపట్టిందన్నారు. చింతపల్లి ఏజెన్సీ లేకపోతే నర్సీపట్నం అంత అభివృద్ధి చెందేదా అన్నారు.

1/70 చట్టం జోలికొస్తే సహించం : సిపిఐ

కొయ్యూరు : 1/70 చట్టం జోలికి ఎవరొచ్చినా సహించబోమని సిపిఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ హెచ్చరించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ 1/70 చట్టం ఆదివాసీల బలిదానం వల్లే వచ్చిందని, ఈ చట్టం ఆదివాసీలకు రక్షణ కవచం, గుండెకాయ లాంటిదని పేర్కొన్నారు. స్పీకర్ మాటలు వెనక ప్రభుత్వ రహస్య ఏజెండా ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చంటి, జల్లి రాజుబాబు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా చలి ఉత్సవాలు ప్రారంభం

-ఉత్సాహంగా సాగిన 5కె రన్ -అలరించిన ప్రదర్శనలు



డప్పుల వాయిద్యాలతో కళాకారులు ప్రదర్శన

ప్రజాశక్తి- అరకులోయ: చలి అరకు ఉత్సవం పండగ వాతావరణంలో ప్రారంభమైంది. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ అరకు రైల్వే స్టేషన్ నుండి 5 కె రన్ ప్రారంభించారు. అరకు చలి ఉత్సవ్ వేదికగా నిర్వహించిన వివిధ సంస్కృతిక కార్యక్రమాలు అల్లరింప జేశాయి. ఉత్సవ వేదికలో జబర్దస్త్ ప్రోగ్రాంల తోపాటు, వివిధ కార్యక్రమాలు కూడా నిర్వహించారు. విజయవాడ నుంచి కర్ర నృత్యం, దంతేవాడ జిల్లా బస్టార్ బ్యాండ్, చంపి గిరిజన దింస నృత్యం, శ్రీకాకుళం జిల్లా ఏచర్ల తప్పెటగుళ్ళు, మధ్యప్రదేశ్ కుటుంబ బాధ నేర్జ్, సాగర్వలస మయూరి బ్యాండ్ బాజా, చింతూరు ఐటిడిఏ కొమ్ము డాన్స్, పార్వతీపురం నందికొత్తల డాన్స్, విజయనగరం జిల్లా బంగర వలస జమ్ముల కల కథ, విజయనగరం జిల్లా శ్రీ రామ చెక్కభజన, తమిళ నాడు ఊటీ తోడ డాన్స్ వంటి కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి, కలెక్టర్, ఐటిడిఏ పివో డాన్స్ వేసి ఆకర్షణ గా నిలిచారు.

ఉత్సవేదికలో పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ గీతాలపన చేసి అలరింపజేశారు. ఒకే వేదికలో 8 రాష్ట్రాల వివిధ ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించడంతో ప్రాంగణమంతా హర్ష ధ్వనులతో కేరింతలు కొట్టారు. ఉత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ లు చూపర్లను అమితంగా ఆకట్టుకున్నాయి. ఉత్సవ ప్రాంగణంలోని ఫుడ్ కోర్టులో అరకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వివిధ సంప్రదాయ గిరిజన వంటకాలు అందరి దృష్టిని ఆకర్షించింది. అదేవిధంగా అంగన్వాడి కార్యకర్తలు ఆదివాసి వస్త్రధారణతో కనిపించడం అందరి దృష్టిని ఆకర్షించింది. అంతకుముందు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తో పాటు, పాడేరు ఐటిడిఏ పిఓ, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్లతో పాటు, మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పట్నాసి, చలపతిరావు ప్రముఖ వ్యాపారవేత్త మయూరి రాజారావు సందర్శించారు, గిరిజన మ్యూజియం గోడలపై కలెక్టర్ ఇతర ఐఏఎస్ అధికారులు డ్రాయింగ్ వేసి అందరినీ ఆకర్షించారు. ఉత్సవ సందర్భంగా అరకులోయ వేదికగా నిర్వహించిన హెలికాప్టర్ రైడ్ అందర్నీ అలరింప చేసింది.

5కే రన్‌లో 300 మంది పాల్గొన్నారు.

పురుషుల విభాగంలో వి రమేష్, (గన్నెల) ప్రథమ స్థానం, డి అభిషేక్ (కిన్నంగూడ), ద్వితీయ స్థానం, సామ్యూల్ (మజ్జీవలస) తృతీయ స్థానాల్లో నిలిచారు. మహిళల విభాగంలో సెకండ్ స్టాండర్డ్ విద్యార్థిని జీవన (లిట్టిగూడ), ఎస్ మంజుల ద్వితీయ స్థానంలో నిలిచారు. అనంతరం విజేతలకు జిల్లా కలెక్టర్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం జె అభిషేక్ గౌడ, ఐటిడిఏ పిఓ వి .అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ఎఎస్పీ ధీరజ్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్మోహనరావు, విద్యార్థులు, మహిళలు, పర్యాటకులు పాల్గొన్నారు.

ఫ్లవర్ ఎగ్జిబిషన్ షో ప్రారంభం

అరకులోయ రూరల్: అరకు ఉత్సవాలలో భాగంగా పద్మాపురం బొటానికల్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఫ్లవర్ షో ను శుక్రవారం చింతరు పిఓ అపూర్వ భారత్, రంపచోడవరం ఐటిడిఏ పీఓ కోట సింహాచలం కలిసి ఘనంగా ప్రారంబించారు. అనంతరం వివిధ ఫ్లవర్‌లతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ తిలకించారు. గార్డెన్లో పూలు మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో అల్లూరి జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ గౌడ్, పాడేరు ఐటిడిఏ పీఓ వి.అభిషేక్, ఎగ్జిబిషన్ నిర్వాహకులు రజినీ, పద్మాపురం గార్డెన్ మేనేజర్, ఎల్ బొంజుబాబు, తదితరులు పాల్గొన్నారు.


వాయిద్యాలతో నృత్యం చేస్తున్న కళాకారులు


నూతనంగా ఎన్నికైన ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు

ప్రజా సమస్యల పరిష్కారానికి పాత్రికేయులు పాటుపడాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ప్రజా సమస్యల పరిష్కారానికి, ప్రజా శ్రేయస్సు కోసం పాత్రికేయులు పాటుపడాలని రాజవొమ్మంగి ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షులు తూపాటి వీర్రాజు, పెదిరెడ్డి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం రాజవొమ్మంగి మండల అల్లూరి ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నికలు గౌరవ అధ్యక్షులు టి.వీర్రాజు, పెదిరెడ్ల వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగాయి. అధ్యక్షులుగా అరిపాక సూరిబాబు, ఉపాధ్యక్షులు గుటాల ఉదయభాను, కార్యదర్శిగా పుట్టా రామరాజు, సహాయ కార్యదర్శిగా ఈకా శ్రీనుబాబు, ట్రెజరర్‌గా పోలిన సత్తిబాబు, కన్వీనర్‌గా బోడారపు శ్రీనివాస్, సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు విలేకరులు మాట్లాడుతూ పాత్రికేయులు స్వచ్ఛంద సేవల్లో భాగస్వాములు కావాలన్నారు. సభ్యులందరూ ఐక్యంగా ఉండి పాత్రికేయులు సంక్షేమం కోసం పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రింటు, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని మర్రివాడ పంచాయతీలో డాక్టర్ కే రాజేష్ కుమార్ ఆధ్వర్యాన, రత్నంపేట పంచాయతీలో డాక్టర్ ప్రసన్న కుమార్ ఆధ్వర్యాన శుక్రవారం ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. రెండు పంచాయతీలను మొత్తంగా 60 అనారోగ్య పశువులకు వైద్యం అందించారు. 110 పెద్ద పశువులకు, 34 పెయ్యలకు, 122 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేశారు. 20 గొర్రెలకు 30 కోళ్లకు ముందస్తుగా రోగ నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ డి శ్రీనివాస్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



జీవాలకు మందులు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

గిరిజనుల వలస బాట

కూలి పనుల కోసం తెలంగాణ రాష్ట్రానికి బయలుదేరిన ఆదివాసీలు

ప్రజాశక్తి -సీలేరు

ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల్లో గ్రామాల్లో కూలి పనులు లేకపోవడంతో పొట్టకూటి కోసం 100 కుటుంబాలకు పైగా గిరిజనులు వలస బాట పట్టారు. 2024లో తుపాన్లు, భారీ వర్షాలు, వరదలు కారణంగా వరితో పాటు పోడు భూముల్లో సాగు చేసిన అపరాలు, చిరుధాన్యాల పంటలు దెబ్బతిన్నాయి. వర్షాలకు పంటలు దెబ్బతిని రాగులు, చిక్కుళ్ళు, వరి ఇతర దినుసు పంటలు ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. పంటచేతికి రాకపోవడంతో ఏడాది పొడవునా తిండి గింజలు సరిపోయే పరిస్థితి లేదు. మరో వైపు వ్యాపారుల దగ్గర చేసిన అప్పులు తీరకలేక, కుటుంబ పోషణ గడవక సతమతమవుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితులు పొట్టకూటి కోసం జిల్లాలోని కూనవరం, తెలంగాణ రాష్ట్రం భద్రాచలం ప్రాంతాల్లో మిరప పళ్ళు సేకరణ, ఇతర పనులు చేపట్టడానికి కుటుంబంలో స్త్రీ పురుషులిద్దరూ మొత్తం 200 మంది వరకు బయలుదేరి వెళ్లారు. పురుషుడికి రోజుకి రూ.350, స్త్రీకి రూ.300 చొప్పున రైతులు కూలి ఇస్తామని చెప్పడంతో తరలివెళ్లారు. రెండు మూడేళ్ల క్రితం ఆంధ్రా ఒడిశా సరిహద్దుల్లో గిరిజనులు గంజాయి విస్తృతంగా సాగు చేసేవారు. ఆంధ్ర ఒడిశా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గంజాయి సాగు, అక్రమ రవాణా అరికట్టడానికి పకడ్బందీ చర్యలు చేపట్టడంతో గిరిజనులు గంజాయి సాగుకు స్వస్తి పలికారు. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ పంటలు వేసినా ఈ ఏడాది వర్షాలకు దెబ్బతిన్నాయి. దీంతో కుటుంబ పోషణ కోసం ఏఓబి సరిహద్దు గ్రామాలైన కప్పు తొట్టి, తాటిమానుగూడ, మేట్టమామిడి, కొట్టును పొదర్ తదితర గ్రామాల ప్రజలు కూలి పనుల కోసం వలస వెళ్లారు. ఇప్పటికైనా ప్రభుత్వం నష్టపోయిన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని, ఉపాధి హామీ ద్వారా పూర్తిస్థాయిలో కూలి పనులు కల్పించాలని పలువురు కూలీలకు కోరుతున్నారు.



తెలంగాణ రాష్ట్రానికి వాహనంలో వెళ్తున్న ఆంధ్రా, ఒడిశా సరిహద్దు గ్రామాల గిరిజనులు

నిబద్ధత కలిగిన యుటిఎఫ్ కార్యకర్తను కోల్పోయాం

సాయిబాబాకు నివాళు లర్పించిన ఎమ్మెల్సీ ఐవి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

నిబద్ధత కలిగిన యుటిఎఫ్ కార్యకర్తను కోల్పోయామని ఉభయ గోదావరి జిల్లాల పట్టబద్రుల ఎమ్మెల్సీ ఇళ్ళా వెంకటేశ్వరరావు (ఐవి) పేర్కొన్నారు. మారేడుమిల్లి మండలం సున్నంపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న మడకం సాయిబాబా దొర గురువారం సాయంత్రం రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రి అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఇళ్ళా వెంకటేశ్వరరావు శుక్రవారం సాయిబాబా స్వగ్రామం బందపల్లి వచ్చి సాయిబాబా భౌతిక కాయంపై యుటిఎఫ్ జెండాను కప్పి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐవి మాట్లాడుతూ సాయిబాబా దొర ఏజెన్సీ ప్రాంతంలో యుటిఎఫ్‌కి ఒక నిబద్ధత కలిగిన కార్యకర్తగా 22 ఏళ్లుగా ఉన్నాడని తెలిపారు. ఎన్నో అటుపోట్లను ఎదుర్కొన్నాడని యుటిఎఫ్ ఉన్నతకి ఎంతో కృషి చేశాడని కొనియాడారు. అనేక పోరాటాలు, ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించారన్నారు. అలాంటి కార్యకర్త ఆకస్మికంగా మరణించారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని పేర్కొన్నారు. సాయిబాబా దొర కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. యుటిఎఫ్ జిల్లా నాయకులు కృష్ణ విశ్వరాజ్, విల్సన్ బాబు, ఆదిరెడ్డి సూరిబాబు, మారేడుమిల్లి, రంపచోడవరం మండలాల యుటిఎఫ్ నాయకులు దూడ మహేష్, కృష్ణారెడ్డి, సనాతన బాబు, వెంగళరావు, డిపి లింగన్న, వెంకన్న దొర, ఆంధ్రయ్య తదితరులు సాయిబాబాదొరకు నివాళు లర్పించారు.


- సాయిబాబాదొర మృతదేహంపై యుటిఎఫ్ జెండాను కప్పి నివాళులర్పిస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు,
- ఇన్‌సెట్‌లో సాయిబాబాదొర (ఫైల్‌ఫొటో)


ఐటిడిఎ పిఒ అపూర్వభరత్‌కు వినతిపత్రం ఇస్తున్న మొద్దులగూడెం వాసులు

మా గ్రామానికి ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

- చింతూరు ఐటిడిఎ పిఒకు మొద్దులగూడెం వాసుల వినతి

ప్రజాశక్తి-విఆర్.పురం

పోలవరం ప్రాజెక్టు కాపర్ డ్యామ్ వల్ల 41.15 కాంటూరు లెవల్‌లో ఉన్న తమ గ్రామం ప్రతి ఏటా ముంపునకు గురవుతుందని, మా గ్రామాన్ని 41.15 కాంటూరులో చేర్చి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని మండలంలోని మొద్దులగూడెం (తోటపల్లి) గ్రామస్తులు శుక్రవారం చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్‌కు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికీ ఇళ్ళ ప్యాకేజీ, అర్ అండ్ ఆర్ రాలేదని, 2022 వరదల్లో గ్రామం మొత్తం మునిగిపోవడంతో మా గ్రామం పైనుండి బోట్లు తిరిగాయని తెలిపారు. తక్షణమే ఆర్ అండ్ ఆర్ సర్వే నిర్వహించి ఇళ్ళ ప్యాకేజి, పునరావాసం, అర్ అండ్ అర్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఐటిడిఎ పిఒ సమస్య అర్ అండ్ అర్ కమిషనర్‌కు తెలియజేసి న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ నిర్వాసితులు సోడి మల్లయ్య, కుంజా కన్నయ్య, ముల్లి శ్రీను, కుంజా రమేష్, కుర్సం శ్రీను, ముల్లి మోహన్, గొంది చంద్రమ్మ, మడకం కమల తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన కాకురు వరలక్ష్మి సేవలు అభినందనీయమని లబ్బర్తి ఎంపిటీసీ గొల్లపూడి పెద్దిరాజు, పాఠశాల హెచ్‌ఎం గోపాలకృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ ఎం శ్రీను తదితరులు పేర్కొన్నారు. వరలక్ష్మి ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం సన్మాన సభ హెచ్‌ఎం గోపాలకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. వరలక్ష్మిని ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ వరలక్ష్మి 1999లో ఉద్యోగంలో చేరి కాత్రావులపల్లి, రంప చోడవరం, వై రామవరం, ఎల్లవరం, గంగవరం, రాజవొమ్మంగి పాఠశాలల్లో పని చేశారని, ఎక్కడా ఎటువంటి రిమార్కులు లేకుండా ఉన్నతాధికారుల మన్ననలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యా కమిటీ సభ్యులు, గ్రామస్తులు వరలక్ష్మి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


ఉద్యోగ విరమణ చేసిన వరలక్ష్మిని సత్కరిస్తున్న దృశ్యం

పాఠశాలకు భూములిచ్చినా కల్పించని ఉపాధి


నూతనంగా నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల

-అధికారుల చుట్టు ప్రదక్షిణలు
-అయినా ఫలితం శూన్యం
-ఆందోళన బాట పట్టిన దాతలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ఏకలవ్య పాఠశాల భవన నిర్మాణాలకు భూములు దానం చేసిన గిరిజనులకు ఇప్పటికీ ఆ పాఠశాలలో ఉపాధి అవకాశాలు కల్పించలేదు. దీంతో, భూములు దానం చేసిన దాతలకు ఉపాధి కల్పించక పోవడంతో ఒకపక్క వ్యవసాయం కోల్పోయి మరోపక్క ఉపాధి లేక ప్రస్తుతం రోడ్డున పడ్డారు. ఉపాధి కల్పిస్తామంటే భూములు ఇచ్చామని తమకు ఉపాధి కల్పించాలని సంబంధిత అధికారుల చుట్టూ ఏళ్ళు తరబడి భూభాధితులు ప్రదక్షిణలు చేస్తున్నా ఇప్పటికీ వారికి ఎటువంటి ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో మానసికంగా ఆవేదనకు గురవుతున్నారు. ప్రస్తుతం న్యాయం చేయాలని ఏకలవ్య పాఠశాల ఆవరణ ఎదుట టెంట్ వేసి గత వారం రోజుల నుంచి దీక్షలు చేపట్టి ఆందోళన కొనసాగిస్తున్నారు.

మండలంలో ఏకలవ్య పాఠశాల 2011లో మంజూరు కాగా మండలంలో ఎటువంటి ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో అరకులోయ మండల కేంద్రంలో అప్పట్లో ప్రారంభించారు. 2016లో భవనాల నిర్మాణంకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో 2019లో శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. భవనాల నిర్మాణంకు సుమారు 11 ఎకరాల అవసరం ఉండగా స్థానిక గిరిజనులు వ్యవసాయం సాగు చేసుకుంటున్నా భూములను ముందుకు వచ్చి దానం చేశారు. భూములు ఇచ్చిన గిరిజనులకు అదే పాఠశాలలో ఉద్యోగాలు కల్పిస్తామని అప్పట్లో అధికారులు హామీని ఇవ్వడంతో భూములు ఇచ్చారు. భూములు ఇచ్చిన దాతలకు ఉద్యోగాలు కల్పించకుండా వేరే వారిని అధికారులు నియమించుకున్నారు. దీంతో ప్రస్తుతం భూదాతలకు ఉద్యోగాలు లేకుండా పోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆందోళన బాట పట్టిన దాతలు:

భూములు ఇచ్చి సుమారు 9 ఏళ్ళు గడుస్తున్నా ఇప్పటికి ఉద్యోగాలు కల్పించక పోవడంతో భూ దాతలు న్యాయం చేయాలని కోరుతూ స్థానిక ఏకలవ్య పాఠశాల ఆవరణ బయట టెంటు వేసి దీక్షలు చేపట్టి గత వారం రోజుల నుంచి ఆందోళన చేపడుతున్నారు. తమ న్యాయమైన సమస్య పరిష్కారానికై పలు పార్టీలు, ప్రజా సంఘాలు సంఘీభావం ప్రకటిస్తూ మద్దతు తెలుపుతున్నాయి.

ఉపాధి కల్పించాలి



మాది వ్యవసాయ కుటుంబం. ఈ భూములు మీదే ఆధారపడి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబం జీవనం సాగిస్తున్నాం. ఇంటర్ వరకు చదువుకుని ఉన్నాను. ఆ పాఠశాలలో ఉద్యోగం కల్పిస్తామని అధికారులు,స్థానిక ప్రజా ప్రతినిధులు కొంతమంది హామీ ఇవ్వడం బట్టి సాగు చేస్తున్న ఎకరం నర భూమిని ఇవ్వడం జరిగింది. ఇప్పటివరకు ఎటువంటి అవకాశం కల్పించలేదు. తక్షణమే మాకు ఉపాధి కల్పించి న్యాయం చేయాలి.

జి.రామ్‌చందర్
భూ దాత

వ్యవసాయాన్ని కోల్పోయాం

కుటుంబంలో ఒకరిద్దరికి ఉద్యోగాలు కల్పిస్తామని ఆశ చూపితే వ్యవసాయం చేస్తున్న ఎకారమున్నర సాగు భూమిని పాఠశాలకు ఇవ్వడం జరిగింది. ఇప్పటివరకు ఎటువంటి ఉద్యోగాలు కల్పించలేదు. అటు వ్యవసాయం కోల్పోవడంతో పాటు ఉద్యోగం కూడా లేకపోవడంతో కుటుంబం రోడ్డున పడ్డాం. అధికారుల చుట్టూ తిరిగిన ఫలితం లేదు. తక్షణమే మాకు న్యాయం చేయాలి.



జి డొంబు
భూ ధాత

బాధిత మహిళకు సిపిఎం సంఘీభావం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలో గత ఐదు రోజుల నుండి ఆదివాసీ మహిళా తన భూమి ఆక్రమణకు గురి అయ్యిందని, న్యాయం కోసం పోరాడుతున్న గంపారాయి బాలప్రభకు సిపిఎం మండల కార్యదర్శి వి లక్ష్మణ్ రావు ఆధ్వర్యంలో సంఘీభావం తెలియజేశారు. బాధితుల వద్ద ఉన్న ప్రాథమిక ఆధారాలను అడిగి తెలుసుకొనట్టు వారు తెలిపారు. గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణారావు మాట్లాడుతూ, రెవెన్యు అధికారులు అనేక ప్రజా పిర్యాదులను బుట్టదాఖలు చేస్తున్నారని తెలిపారు. కాబట్టే ప్రజలు ఆందోళనలు చేపడుతున్నారన్నారు.వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.హైమావతి, తడిగిరి పంచాయితీ వైస్ సర్పంచ్ కిలో రామారావు, కొంటిలి వైస్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి, అడ్డుమండ పార్టీ బాధ్యులు కొర్ర అప్పారావు,తదితరులు పాల్గొన్నారు

డిఎస్‌పిగా అహ్మద్ బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-పాడేరు టౌన్: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు నూతన డిఎస్పీగా షేక్ షాహబాజ్ అహ్మద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఆయన చింతపల్లి డిఎస్ పిగా ఉన్నారు.

కొనసాగుతున్న లోకో పైలట్ల నిరసన

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్ఎం) కార్యాలయం ఎదుట లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు, ట్రెయిన్ మేనేజర్లు సంయుక్తంగా చేపట్టిన నిరసన శుక్రవారం నాటికి ఆరో రోజుకు చేరుకుంది. శుక్రవారం మౌన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రెండేళ్లుగా మినిమం గ్యారెంటీడ్ కిలోమీటర్ల కోసం తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. మైలేజ్ కారణంగా ఉద్యోగులకు వచ్చే అలవెన్సులు నష్టపోతున్నామని, సమయ పాలనకు అనుగుణంగా గతంలో ఇచ్చిన విధంగా అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినిమం గ్యారెంటీడ్ కిలోమీటర్లను డ్యూటీ ప్రారంభం నుంచి 120 కిలోమీటర్లుగా నిర్ణయించి, అలవెన్సులు అందించాలని కోరారు. ఈ డిమాండ్ నెరవేరే వరకు నిరసన కొనసాగిస్తామని స్పష్టంచేశారు. డిఆర్ఎం సానుకూలంగా స్పందించకపోతే విధులను బహిష్కరిస్తామని హెచ్చరించారు.


మాట్లాడుతున్న దొన్నుదొర

అరకు చలి ఉత్సవ్‌పై మాట్లాడే అర్హత వైసిపికి లేదు

అరకు టిడిపి ఇన్‌ఛార్జి దొన్నుదొర

ప్రజాశక్తి-అరకులోయరూరల్

అరకులోయ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న చలి ఉత్సవాలపై మాట్లాడే అర్హత వైసిపి నాయకులకు లేదని అరకు టిడిపి ఇన్చార్జ్, ఏపీఎస్ఆర్టీసి బోర్డు చైర్మన్ సియ్యారి దొన్నుదొర అన్నారు. అరకులోయలో శుక్రవారం ఆయన కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ, అరకు ఉత్సవాలతో మరిన్ని గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు, గిరిజనుల జీవన విధానాన్ని ప్రపంచానికి చాటి చెప్పటానికి చలి ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అరకు ఉత్సవాలపై ఎమ్మెల్యే విమర్శించడం సరికాదని తెలిపారు. కూటమి ప్రభుత్వ హాయంలోనే ఏజెన్సీ గిరిజన ప్రాంతం అభివృద్ధి జరుగుతున్నాయని ఎక్కడికక్కడ నూతన రహదారులు ప్రారంభోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గిరిజన ఏజెన్సీ ప్రాంతంలో మంచినీటి సౌకర్యం ఏర్పాటు కోసం నిధులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైసిపి ప్రభుత్వం హయాంలో పంచాయితీ నిధులు వేరే ఖాతాల్లోకి మళ్ళించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెదలబుడు సర్పంచ్ పెట్టేలి దాసుబాబు, మాజీ సర్పంచ్ ఎల్ మహదేవ్, చందు, కళావతి, త్రినాధ్, నాగరాజు, బి బి లక్ష్మి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అరకు ఉత్సవాల పేరుతో వ్యాపారం

» **ఎమ్మెల్యేలు మత్స్యలింగం, విశ్వేశ్వరరాజు**
» **రోడ్డుపై బైఠాయించి నిరసన**

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఐటిడిఏ నిధులతో ప్రభుత్వం నిర్వహిస్తున్న అరకు చలి ఉత్సవాలు కేవలం వ్యాపార ఉత్సవాలు అని నిజమైన గిరిజన సంప్రదాయ ఉత్సవాలు కాదని అరకు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యలింగం, విశ్వేశ్వరరాజు విమర్శించారు. ఉత్సవాలను రద్దు చేసి గిరిజన ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతూ అరకులోయ మ్యూజియం గేటులో వైకాపా తలపెట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా పాడేరు నుంచి అరకులోయకు బయలు దేరిన ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును జైపూర్ జంక్షన్ జాతీయ రహదారిలో శుక్రవారం పోలీసులు అడ్డుకున్నారు. దీంతో జంక్షన్లోనే నిరసనకు దిగారు. అక్కడికి చేరుకున్న అరకు ఎమ్మెల్యే ఆ పార్టీ శ్రేణులతో బైఠాయించి నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడ్లారు. అరకు చలి ఉత్సవాల పేరుతో ప్రజాధనం దుర్వినియోగ చేయడమే తప్పా! ఆదివాసీలకు జరిగిందేమి లేదని అన్నారు. గిరిజన ప్రాంతాలలో కనీస మౌలిక సౌకర్యాలు లేని గ్రామాలు ఉన్నాయని, గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సదుపాయలు కల్పించాలన్నారు. గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం సవరణ ద్వారానే ఏజెన్సీలో పెట్టుబడులు వస్తాయని రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్ వ్యాఖ్యాలు చేయడం చూస్తుంటే గిరిజనులపై కూటమి ప్రభుత్వ వైఖరి స్పష్టంగా కనబడుతుందన్నారు. ఆదివాసీ చట్టాలు పటిష్టంగా అమలు చేసి, విద్య, వైద్యం, యువతకు ఉపాధిని కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని వారు హితవు పలికారు. ఆ పార్టీ నాయకులు చిన్నారావు, అప్పాలు, మల్లేశ్వరరావు, హరి, ఆనంద్, సురేషకుమార్ పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యేలు మత్స్యలింగం, విశ్వేశ్వరరాజు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా విజయగౌరిని గెలిపించండి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కన్వీనర్ కెఎస్.కుమార్ మంగళం ఉపాధ్యాయ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మద్దిలపాలెం ప్రాంతంలో కోరెడ్ల విజయ గౌరితో కలిసి ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థలలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయగౌరి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న నూతన విద్యా విధానం వల్ల విద్యార్థులతో పాటు అధ్యాపకులకు తీవ్ర హాని కలగబోతుందని చెప్పారు. ఇప్పటికే అనేక యాప్‌లు తెచ్చి ఉపాధ్యాయలపై పని భారాన్ని పెంచారని తెలిపారు. రేషనలైజేషన్‌తో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రమాదం ఏర్పడబోతుందన్నారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ప్రభుత్వమే వేజ్ బోర్డు ఏర్పాటుచేయాలని, హెల్త్ ఇన్సూరెన్స్, వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు, 200 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్‌తో ముందుకు వెళున్నామన్నారు. శాసన మండలిలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఇప్పటికే ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై కృషి చేస్తున్నారని తెలిపారు. శాసన మండలిలో పిడిఎఫ్ బలం పెంచేందుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

అధికారులతో నీతి అయోగ్ సభ్యుల సమావేశం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : సిరిపురంలోని విఎంఆర్‌డిఎ సమావేశ మందిరంలో నీతిఆయోగ్ ప్రధాన ప్రగతి చోదకాలైన ఆక్వా, ఔషధ, ఉక్కు, పెట్రోకెమికల్ రంగాలపై జిల్లా అధికారులతో నీతి అయోగ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సుబ్రహ్మణ్యం, నీతి ఆయోగ్ సభ్యులు ఎస్.కిషోర్ శుక్రవారం సమావేశమయ్యారు. స్థానికంగా లభ్యమయ్యే వనరులపైనా, అభివృద్ధికి అవకాశం ఉన్న వివిధ రంగలపైనా చర్చించారు.

కేన్సర్ బాధితునికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న టిడిపి, జనసేన నాయకులు

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని రాజేంద్రపాలెంలో బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతున్న గోకిరి శ్యాంప్రకాశ్‌కు జనసేన నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. శ్యాంప్రకాశ్ మూడేళ్ల నుండి బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతుండగా, టిడిపి జనసేన పార్టీల నాయకులు హాస్పిటల్‌లో వైద్యం చేయించడంతోపాటు దాతల నుండి విరాళాలు సేకరించి ఆ మొత్తాన్ని శుక్రవారం అందజేశారు. డబ్బులు కొరత కారణంగా శ్యాంప్రకాశ్‌కు కిమియోథెరిఫీ ఏడాది నుండి చేయించలేక ఇబ్బంది పడుతున్నారని, దాతలు ఎవరైనా ఉంటే విరాళాలు అందించి ఆ బాలుడిని కాపాడాలని జనసేన నాయకులు కోరారు. తమ పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గంగులయ్య దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు గూడెం లక్ష్మణ్, నాయకులు సాగిన బుజ్జిబాబు, గూడెపు శేషుబాబు, పీటా సుధీర్ బాబు, పూర్రా రాజేష్, నాగేంద్రబాబు, రాఘవరాజు, బంగారుబాబు, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు శతాబ్ది ఉత్సవాలు


వివరాలు వెల్లడిస్తున్న కమిటీ అధ్యక్షుడు అప్పలనాయుడు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్థాపించి వందేళ్ళు పూర్తయిన సందర్భంగా ఈనెల 1,2 తేదీల్లో శతాబ్ది ఉత్సవాలు నిర్వహించనున్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఉత్సవ నిర్వహణ కమిటీ అధ్యక్షులు జి అప్పలనాయుడు, కార్యదర్శి మైలపల్లి లక్ష్మణరావు, కన్వీనర్ ఎం.షణ్ముఖరావు ఉత్సవ వివరాలను వెల్లడించారు. 1న శనివారం జాతీయ జెండా, శతాబ్ది ఉత్సవాల జెండా ఆవిష్కరణతో పాటు ఉత్సవాలకు గుర్తుగా పాఠశాల ఆవరణలో పైలాన్‌ను ఆవిష్కరించనున్న ట్లు వివరించారు. స్థానిక బీచ్‌లోని 'మన భీమిలి పార్కు' వద్ద పద్మభూషణ్ సర్ రతన్‌టాటా విగ్రహావిష్కరణ, 2న ఆదివారం సెయింట్ ఆన్స్ పాఠశాల క్రీడా మైదానంలో పూర్వ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహణ, విశ్రాంత ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో సత్కారం ఉంటుందన్నారు. రెండ్రోజుల పాటు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం వంటి పలు కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. రెండ్రోజుల శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలోఉత్సవ నిర్వహణ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఒకేరోజు రూ.అర కోటి పన్ను వసూలు

ప్రజాశక్తి- గాజువాక : జివిఎంసి గాజువాక జోన్ రెవిన్యూ విభాగం (టాక్స్) అధికారులు, సిబ్బంది శుక్రవారం ఒక్కరోజులోనే రూ. అరకోటి పన్ను వసూలు చేసి జమ చేశారు. టింపనీ స్కూల్, శ్రావణి షిప్పింగ్, ఎపిఎస్ఆర్‌టిసి మూడు సంస్థల నుంచి వసూలు చేసిన రూ. అరకోటి ఆదాయపు పన్ను చెక్‌ను జోనల్ కమిషనర్ శేషాద్రికి ఆర్ఒ రామ్‌నారాయణ్, ఆర్ఐలు రెడ్డి మోహన్, రాజేంద్ర అందజేశారు.

గర్భిణి, గర్భస్థ శిశువు మృతిపై

సమగ్ర విచారణ జరిపించాలి

- **బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి**
- **పోలవరం నిర్వాసిత కాలనీ ప్రజలపై నిర్లక్ష్యం తగదు**
- **సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్**

ప్రజాశక్తి-విఆర్.పురం : ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణి, ఆమె కడుపులోని గర్భస్థ శిశువు మృతి చెందడంపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసిత గ్రామమైన ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం రామన్నగూడెంలో నివసిస్తున్న కొండరెడ్డి సామాజిక తరగతికి చెందిన గిరిజన మహిళ వాళ్ల మధుబాల రెండో కాన్పు నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిందని తెలిపారు. అయితే అక్కడ డాక్టర్ నిర్లక్ష్యం కారణంగా గర్భిణి మధుబాలతో పాటు ఆమె కడుపులోని బిడ్డ, చనిపోవడం జరిగిందని, ఇది దారుణమైన సంఘటన అని పేర్కొన్నారు. మొన్నటి వరకు ఆ గ్రామస్తులు శ్మశాన వాటిక కోసం ఇబ్బంది పడ్డారని, నేడు సరైన వైద్య సదుపాయం లేక మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలవరం నిర్వాసిత కాలనీ ప్రజలపై ఇటువంటి నిర్లక్ష్య వైఖరి సరికాదని పేర్కొన్నారు.

విఆర్.పురం మండలం తుమ్మిలేరు గ్రామం నుండి ప్రజలు పోలవరం నిర్వాసిత గ్రామమైన రామన్నగూడెంకు మూడేళ్ల క్రితం వెళ్లారని తెలిపారు. కొద్దిమంది నిర్వాసితులే ఉన్నా పూర్తిగా అన్ని రకాల సౌకర్యాలు ప్రభుత్వం కల్పించలేదని, అందరినీ పునరావాస కాలనీలకు పంపితే ఇంకెంత మంది ప్రాణాలు పోగొట్టుకోవలసి వస్తుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. పచ్చని అడవిలో కల్మషం లేని జీవనాన్ని కొనసాగిస్తున్న అమాయక ఆదివాసీలను పోలవరం ప్రాజెక్టు పేరుతో చెట్టుకొకరు, పుట్టకొకర్ని చేసి ఇలా బలిగొంటున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జరిగిన సంఘటనపై విచారణ జరిపించి డ్యూటీలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్‌ను శిక్షించాలని, మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి, ఆమె కుమార్తెకు ప్రభుత్వం చదువుతో బాటు అన్ని సహాయ సహకారాలు అందించాలని డిమాండ్ చేశారు.

గీతంలో ముగిసిన 'జెమ్ -25'

ప్రజాశక్తి -మధురవాడ : గీతం వర్సిటీ బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న గీతం ఎక్సలెన్స్ మీట్ (జెమ్)25 శుక్రవారం ముగిసింది. స్టాక్ ఎక్చేంజ్ ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథన్ పాల్గొని వివిధ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా ఫణిపప్పు మాట్లాడుతూ భావి యువతలో నాయకత్వ లక్షణాలతో బలోపేతమే లక్ష్యంగా నిర్వహించిన జెమ్25లో కార్పొరేట్ సంస్థల నిపుణులు హాజరై యువతకు దిశానిర్దేశ్యం చేశారు. వాణిజ్య అంశాలపై వర్క్‌షాపులో సమకాలీన కార్పొరేట్ రంగం ఎదుర్కొంటున్న సవాళ్ళపై చర్చించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శలను అలరించాయి. కార్యక్రమంలో జెమ్ కన్వీనర్ డాక్టర్ బి.కృష్ణకుమారి, ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎస్ఎస్.మిశ్రా, కో సిఇఒ కె.చెర్రి హేడ్స్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఇన్‌ఛార్జి డైరక్టర్ డాక్టర్ కె.లుబ్జా నిహార్ పాల్గొన్నారు..


జెమ్ ముగింపోత్సవంలో సాంస్కృతిక ప్రదర్శన

పెండింగ్ కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం కీలకం

ప్రజాశక్తి- విశాఖ లీగల్ : న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల పరిష్కారంలో మధ్యవర్తిత్వం పాత్ర కీలకమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి అలపాటి గిరిధర్ అన్నారు. మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ ముగింపులో మాట్లాడుతూ, మున్ముందు మధ్యవర్తిత్వంతో రాజీ మార్గంలో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. సుప్రీంకోర్టు మీడియేషన్ కన్సిలేషన్ కమిటీ సభ్యులు సత్యారావు, ఆర్ రతన్తారాలను సత్కరించారు. శిక్షణలో విశ్రాంత న్యాయమూర్తులు, న్యాయవాదులు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ వెంకట శేషమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్

ఆకట్టుకున్న దయాల్‌బాగ్ వస్తు ప్రదర్శన

ప్రజాశక్తి - ఆరిలోవ : దయాల్‌బాగ్ విద్యాసంస్థ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం విశాలాక్షినగర్, దయాల్‌నగర్‌లోని: దయాల్‌బాగ్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్‌లో వస్తు, విద్యాసంస్థ కోర్సుల ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. సంస్థ జిల్లా సెక్రటరీ కె.మురళీధరరావు ప్రారంభించిన ప్రదర్శలో విద్యాసంస్థలో రోజువారి తయారు చేసిన స్వయంఉపాధి వస్తువులు, బ్లాక్ ప్రింటింగ్ చీరలు, జ్యూట్ బ్యాగ్స్, రుమాళ్ళు, చీరలు, దుప్పట్లు, చున్నీలు, చుడీదార్లు, గౌన్లు, నైటీస్, టాప్స్ ప్రదర్శన, అమ్మకానికి ఉంచారు. విద్యాసంస్థలో పండించిన ఆర్గానిక్ కూరగాయలు, విద్యార్థులు తయారు చేసిన ఎలక్ట్రానిక్ పరికరాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. వివిఎస్ కృష్ణ, గాయత్రి కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు ఈ ప్రదర్శనను సందర్శించి అక్కడ నడుపుతున్న కోర్సు వివరాలను తెలుసుకున్నారు.


మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం చేస్తున్న జెకెసిటి చైర్మన్ జమాల్‌ఖాన్

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా : మండలంలోని సర్వేల గ్రామానికి చెందిన ముర్రం రాజయ్య, ముర్రం బుచ్చయ్య, మడకం భద్రయ్య, మడకం సుబ్బయ్య కుటుంబాల్లో నలుగురు మృతి చెందగా, వారి కుటుంబాలకు ఆయుర్వేద వైద్యులు, జెకెసి ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ ఆర్థిక సహాయం అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.3వేలు చొప్పున రూ.12 వేలు శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు జమాల్ ఖాన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ముత్యాల శ్రీరామ్, పి సాల్మన్ రాజు, జెకెసిట్రస్ట్ సభ్యులు ఎస్‌కె రియాజ్, నటరాజ్, జాన్ ప్రకాష్, జాన్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

చిల్లపేట చెరువు పరిశీలన

ప్రజాశక్తి -తగరపువలస : పర్యావరణ పరిరక్షణ ఉద్యమకారులు, వాటర్ మ్యాన్ రాజేంద్రసింగ్ శుక్రవారం చిల్లపేట, చిట్టి వలస పెద్ద చెరువును పరిశీలించారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ, రెండో వార్డు అధ్యక్షులు నీలాపు శంకర రెడ్డితో కలిసి చెరువును పరిశీలించారు. 36 40 ఎకరాల చెరువు గర్భం, 94 ఎకరాల ఆయకట్టు ఉన్న పెద్దచెరువు అభివృద్ధికి గతంలో రూ 1.98 కోట్లు, వైసిపి హయంలో రూ 6.50 కోట్లు మంజూరయ్యాయని శంకర రెడ్డి వారికి వివరించారు.ఈ సందర్భంగా వాటర్‌మ్యాన్ రాజేంద్రసింగ్ మాట్లాడుతూ, చెరువు విస్తీర్ణం కమేణా తగ్గుతూ వస్తోందని, చెరువును కాపాడుకోవాల్సిన బాధ్యత స్థానిక ప్రజలపై ఉందని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో చెరువులను కాపాడుకోవడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.


చెరువు పరిశీలిస్తున్న రాజేంద్రసింగ్

తల్లిని హతమార్చిన తనయుడు

ప్రజాశక్తి -ములగాడ : అదేపనిగా ల్యాప్‌ట్యాప్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతున్నాడని మందలించిన తల్లిని కత్తితో కొడుకు దారుణంగా చంపిన ఘటన గురువారం రాత్రి మల్కాపురం కోస్టుగార్ట్‌లో చోటుచేసుకుంది. దీనిపై మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివి.

మల్కాపురం ఇండియన్ కోస్టుగార్డులో బల్విందర్‌సింగ్ భార్య అల్కాసింగ్ (47), ఇద్దరు కొడుకులు అనిమల్‌సింగ్, ఆయుష్మాన్‌సింగ్‌తో నివాసం ఉంటున్నారు, హైదరాబాదులోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్న అనిమల్‌సింగ్ ఇటీవల ఇంటికి వచ్చాడు. రోజుకు ఆరేడు గంటల పాటు ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతున్న కొడుకును మందలించిన తల్లి అనుష్క అల్కాసింగ్, అతని నుంచి ల్యాప్‌టాప్‌ను లాక్కొంది. దీంతో ఆగ్రహించిన కొడుకు తల్లిని కత్తితో మెడ, ఒంటిపై పొడిచి హతమార్చాడు, తల్లి ఆల్కాసింగ్ పెద్ద కేకలు వేయటంతో ఇరుగుపొరుగు చూసి కోస్ట్ గార్డ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. కోస్ట్‌గార్డ్ అధికారుల నుంచి సమచారం అందుకున్న మల్కాపురం పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని దాడికి గురైన అనుష్కను ముందుగా ఐఎన్ఎస్ కళ్యాణి ఆసపత్రికి, అక్కడి నుంచి విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. మల్కాపురం సిఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో కేసును దర్యాప్తు చేస్తున్నారు,